# పేదింటి వేడుక .. వైఎస్సార్ పెళ్లి కానుక

- 'కల్యాణమస్తు'తో పేదింటి యువతులకు సౌభాగ్యం
- రెట్టింపైన నగదు ప్రోత్సాహం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మరింత చేయూత

**నిడదవోలు:** జీవితంలో మరుపురానిది వివాహ బంధం. ×పెళ్లి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు× అని పెద్దలు ఏనాడో చెప్పారు. ఈ రెండు కార్యాలు చేసిన కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఉంటాయని దీని సారాంశం. ఇప్పుడు ఆడపిల్లల వివాహం పేద కుటుంబాలకు భారం అవుతోంది. ఎంత తక్కువ ఖర్చుతో వేడుక నిర్వహించాలనుకున్నా అనుకున్న బడ్జెట్ దాటిపోతోంది. బంగారం, తాళి బొట్టు, నూతన వస్త్రాలు, భోజనాలు, మండపం ఇలా భాజాభజంత్రీలు మోగే వరకూ సొమ్ములు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో అమ్మాయిని అత్తవారింటికి పంపిన పుట్టింటి వారు అప్పుల పాలవుతున్నారు. పేదలకు ఈ పరిస్థితి రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలు అమలు చేస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు కులాంతర వివాహ పథకం ద్వారా పేద వధూవరులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ రూపేణా నూతన దంపతులకు ఇచ్చే సాయం మొత్తాన్ని టీడీపీ ప్రభుత్వంలో కంటే ఇప్పటి ప్రభుత్వం రెండింతలు చేసింది. టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకం కింద అరకొరగా పెళ్లి కానుక అందించారు. అదీ కాకుండా సవాలక్ష షరతులు విధించడంతో అర్హులు కూడా ఈ పథకం ద్వారా సాయం పొందలేకపోయారు. అయితే జగన్ ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అనే పథకాల ద్వారా ఏటా నాలుగు సార్లు పేద వధూవరులకు లబ్ధి చేకూరుస్తున్నారు. ఈ రెండు పథకాల ద్వారా నిడదవోలు పట్టణంలో 33 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించారు. నియోజకవర్గంలోని మండలాలవారీగా నిడదవోలులో 42 మందికి, పెరవలిలో 44 మందికి, ఉండ్రాజవరంలో 35 మందికి లబ్ధి చేకూరింది.

**ఇవీ మార్గదర్శకాలు**

వివాహం జరిగిన నెల లోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వధూవరులిద్దరూ టెన్త్ పాసై ఉండాలి. వధువుకు 18, వరుడికి 21 ఏళ్ల వయసు నిండాలి. వరుడు ఇతర రాష్ట్రానికి చెందిన వాడైనా, వధువు మాత్రం ఏపీ నివాసితురాలైతే పథకం వర్తిస్తుంది. భర్త చనిపోయిన స్త్రీకి రెండో వివాహం అయినప్పటికీ కూడా అర్హురాలే. కుటుంబ నెలవారీ ఆదాయం పల్లెల్లో రూ. 10,000, పట్టణాల్లో అయితే రూ.12,000 మించరాదు. కుటుంబానికి మాగాణి 3 ఎకరాలు, మెట్ట10 ఎకరాలకు మించి ఉండరాదు. రెండు కలిపి పదెకరాలు మించకూడదు.

**దరఖాస్తుకు జత చేయాల్సినవి**

వధూవరుల ఆధార్ కార్డులు, టెన్త్ మార్కుల జాబితా, ఇద్దరి ఈ మెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, తల్లి, తండ్రి లేదా సంరక్షకుల ఆధార్ జిరాక్స్ కాపీలు, పెళ్లి ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, వివాహ పత్రిక, వివాహ సమయంలో తీసిన ఫోటోలు, దివ్యాంగురాలయితే సదరం సర్టిఫికెట్. రెండో వివాహం చేసుకునే పెళ్లి కుమార్తె తన మొదటి భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదా వితంతు పింఛన్ కార్డు జిరాక్స్. పట్టణ, గ్రామ సచివాలయాల్లో కేవలం పెళ్లి కూతురు పేరుతో దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన వెంటనే అప్లికేషన్ ఐడీ నంబర్ లబ్ధిదారుల మెబైల్ నంబర్‌కు వస్తుంది.

**భారీగా పెరిగిన పెళ్లి కానుక సాయం**

| కేటగిరీ | టీడీపీ ప్రభుత్వంలో (రూపాయలు) | ప్రస్తుత ప్రభుత్వంలో (రూపాయలు) |
|---|---|---|
| ఎస్సీ | 40,000 | 1,00,000 |
| ఎస్సీ కులాంతర వివాహం | 75,000 | 1.20,000 |
| ఎస్టీ | 40,000 | 1,00,000 |
| ఎస్టీ కులాంతర వివాహం | 75,000 | 1.20,000 |
| బీసీ | 35,000 | 50,000 |
| బీసీ కులాంతర వివాహం | 50,000 | 75,000 |
| మైనార్టీలు | 50,000 | 1,00,000 |
| దివ్యాంగులు | 1,00,000 | 1.50,000 |
| నిర్మాణ కార్మికులు | 20,000 | 40,000 |

**జగనన్న మాటిస్తే తప్పక చేస్తారు**



పాదయాత్రలో ప్రజల కష్టాలు నేరుగా తెలుసుకున్న సీఎం జగన్ ఇచ్చిన మాటను తప్పకుండా నెరవేరుస్తున్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లలకు పెళ్లి చేయాలంటే తలకు మించిన భారం. మాలాంటి పేద కటుంబాలకు వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ఉంతో ఉపయోగకరం. – యజ్ఞ దీపిక, బీసీ లబ్ధిదారు, నిడదవోలు

**ఆర్థిక భారం తగ్గుతుంది**



వైఎస్సార్ కల్యాణమస్తు పథకం వల్ల ఆడపిల్లల తల్లిదండ్రులకు పెళ్లి ఖర్చు భారం తగ్గుతోంది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సొంత అన్నలాగే పేద కుటుంబాల ఆడపిల్లలకు అండగా ఉంటున్నారు. ఆయన దయ వల్ల నిరుపేద కుటుంబాల ఆడపిల్లలకు ఆర్థిక సాయం అందుతోంది. – కస్సె జ్యోతి, ఎస్సీ లబ్ధిదారు

**అన్ని వర్గాలకూ చేయూత**



ఈ పథకం అన్ని వెనుకబడిన వర్గాల ప్రజలకూ న్యాయం చేసేలా ఉంది. ఈ పథకం ద్వారా సాయం సొమ్మును రెట్టింపు చేయడం వల్ల పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. – పాపా మహాలక్ష్మి, బీసీ లబ్ధిదారు, నిడదవోలు

**ఎంతో ఉపయోగం**



చిరు వ్యాపారం చేసుకునే జీవించే మా తల్లిదండ్రులకు ఇద్దరం ఆడపిల్లలం. నేను పెద్దమ్మాయిని. పెళ్లి చేయడానికి ఎంతో కష్టంగా ఉన్న ఈ రోజుల్లో మైనార్టీల వివాహ ఖర్చులకు రూ.లక్ష ఆర్థిక సాయం చేయడం మాకు సంతోషదాయకం. – షేక్ సంషాద్‌బేగం, మైనార్టీ లబ్ధిదారు, నిడదవోలు

**సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం**



గత ప్రభుత్వంలో ఈ పథకాన్ని అరకొరగా అందించారు. అది కూడా సవాలక్ష నిబంధనలతో విధించడంతో ఎవరికీ సరిగ్గా లబ్ధి చేకూరలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వైఎస్సార్ కల్యాణమస్తు పేరుతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. – ఉజ్జిన సిరి, ఎస్సీ లబ్ధిదారు, నిడదవోలు

## క్లుప్తంగా

### మండల ప్రత్యేకాధికారిగా కృష్ణారావు



**నల్లజర్ల:** మండల ప్రత్యేకాధికారిగా జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు నియమితులయ్యారు. నల్లజర్లలో మంగళవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇప్పటివరకూ మండల ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ బాలస్వామిని వివిధ కారణాలతో తొలగించారు.

### చాగల్లు ఎంఈవో-2 గా సుభాకర్



**చాగల్లు:** మండల విద్యాశాఖాధికారి-2 గా సీహెచ్ సుభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ద్వారకాతిరుమల మండలం రామసింగవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా సుభాకర్‌ను మండలంలో పలువురు ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

### 28న దేవరపల్లిలో అమ్మఒడి

**దేవరపల్లి:** గోపాలపురం నియోజకవర్గ స్థాయి అమ్మఒడి నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో జరుగుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కె. మాధవీలత ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తారని చెప్పారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**నిడదవోలు:** స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు కంప్యూటర్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.మేరీ సుజాత మంగళవారం తెలిపారు. ఈ పోస్టులకు ఆసక్తి గల బీటెక్ (సీఎస్‌ఐ)ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 23 తేదీ లోగా కళాశాలలో తమ బయోడేటాతో పాటు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను ఈనెల 26న కళాశాలలో ఇంటర్వ్యూ, డెమో తరగతులు నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు.

### ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

**దేవరపల్లి:** నల్లజర్ల మండలం నబీపేట ఎర్రకాలువ నుంచి అనంతపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ సీఐ దిమ్మల సుధ మంగళవారం తెలిపారు. నబీపేటకు చెందిన ట్రాక్టర్ల యజమానులు ప్రత్తిపాటి రాజేష్, మర్రి మోహనరావులను అదుపులోకి తీసుకుని, నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు ఆమె వివరించారు.

### కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో తీరిన సమస్య



పెద్దేవంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి ఇంపాక్ట్

**తాళ్లపూడి:** మండంలోని పెద్దేవం గ్రామ పంట పొలాల్లో కాలిపోయిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌స్థానంలోఆ శాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ఏర్పాటు చేశారు. దాంతో ఆ ప్రాంత రైతుల పంటలకు నీటి ఎద్దడి సమస్య తీరింది. 'ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది.. పంటలు ఎండుతున్నాయి' అనే శీర్షికన మంగళవారం నాటి 'సాక్షి'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దాంతో ఏఈ సీహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది ఓవర్ లోడ్ వల్ల కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. ఈ లైన్‌పై 18 వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. వాటిని సరఫరా పునరుద్ధరించబడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే రైతులు తమ సర్వీసులకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏఈ వెంకటరావు సూచించారు. ఓవర్ లోడ్ కారణంగా ఈ సమస్య తలెత్తుతోందని తెలిపారు.

## క్రీడల్లో సత్తా చాటితే ఉజ్వల భవిష్యత్తు



మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ గురుమూర్తి తదితరులు

**నిడదవోలు రూరల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ జి.గురుమూర్తి అన్నారు. వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 4, 5 తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో మంగళవారం ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ గురుమూర్తి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు 30, 800 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారుల ఎత్తు, బరువులను కూడా పరిశీలించారు. హెచ్ఎం కె.జిలానీ, వ్యాయామోపాధ్యాయులు పద్మావతి, పాలేటి శ్రీనివాస్, ఎన్టీ రామారావు, ప్రదీప్, ప్రసాద్, శాంతి పాల్గొన్నారు.

## పకడ్బందీగా జగనన్న సురక్ష

**నల్లజర్ల:** ప్రజలకు మేలు చేకూర్చే జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. ఈ పథకంపై అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వి.కృష్ణారావు అధ్యక్షతన నల్లజర్లలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30 వరకూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు ప్రతి ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష పథకం గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను గుర్తించాలన్నారు. జూలై 1 నుంచి మండల స్థాయిలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గడప గడపకూ నిధులతో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పల్లంట్లలో రోడ్డు, డ్రైన్లకు శంకుస్థాపన



పల్లంట్లలో సీసీ రోడ్డుకు, డ్రైన్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి

**దేవరపల్లి:** గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. గడప గడపకూ నిధులు రూ.20 లక్షల వ్యయంతో పల్లంట్ల గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ సెంటర్లో నిర్మించే సిమెంట్ రోడ్డు, రెండు డ్రైన్లకు మంగళవారం ఎమ్మెల్యే తలారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం పర్యటనలో ప్రజలు తన దృష్టిని తెచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. నిధుల కేటాయింపులో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకుడు యలమాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కె.సావరం సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు



లబ్ధిదారుడికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న తణుకు సబ్ రిజిస్ట్రార్ కృష్ణంరాజు, సెక్రటరీ హసన్ జానీ

**ఉండ్రాజవరం:** సచివాలయాల్లో అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.కనకరాజు సూచించారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సేవలను మంగళవారం ఆయన కె.సావరం గ్రామ సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తణుకు సబ్ రిజిస్ట్రార్ కృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని రకాల దస్తావేజుల విక్రయాలు, స్థలాల, భూముల రిజిస్ట్రేషన్, వీలునామా, దత్తత వంటి సేవలన్నీ ఇకపై సచివాలయాల్లోనే పొందవచ్చన్నారు. వాటితో పాటు ఈసీ నకలు, మార్కెట్ విలువ, వివాహ రిజిస్ట్రేషన్ సేవలను కూడా పొందవచ్చన్నారు.

## పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య పరీక్షలు



నల్లజర్ల పీహెచ్‌సీలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**నల్లజర్ల:** రోగుల వ్యాధులను వేగంగా, ఖచ్చితంగా నిర్ధారించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన మెడికల్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ సామాన్యులు, పేదలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను చేరువ చేసిందన్నారు. షుగరు, టీబీ, టైఫాయిడ్, మలేరియా వంటి 64 పరీక్షలు ఇక్కడే చేస్తారన్నారు. డాక్టరు తెల్లం గంగాధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, మండల ప్రత్యేకాధికారి వి.కృష్ణారావు, ఎంపీడీఓ రాజశేఖర్, సీహెచ్ఓ చంద్రశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రహదారుల అభివృద్ధికి రూ.30 కోట్లు

- ఎమ్మెల్యే తలారి విజ్ఞప్తి మేరకు విడుదల
- తీరనున్న పలు గ్రామాల ప్రజల రహదారి కష్టాలు

**దేవరపల్లి:** మండలంలోని రెండు ఆర్ అండ్ బీ రోడ్లకు మోక్షం లభించింది. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఏలూరు-గుండుగొలను-కొవ్వూరు (ఈజీకే) రహదారి, యర్నగూడెం-నిడదవోలు రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈజీకే రోడ్డు నుంచి లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు మీదుగా నిడదవోలు అడ్డ రోడ్డుకు సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా ఉంది. ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే నిడదవోలు-యర్నగూడెం ఆర్‌అండ్ బీ రోడ్డు త్యాజంపూడి నుంచి యర్నగూడెం వరకు మూడు కిలోమీటర్ల మేర పూర్తిగా దెబ్బతింది. టీడీపీ ప్రభుత్వంలో నిడదవోలు నుంచి త్యాజంపూడి వరకూ రోడ్డును విస్తరించారు. త్యాజంపూడి-యర్నగూడెం మధ్య మరో 3 కిలో మీటర్ల మేర విస్తరణ పనులు జరగలేదు. ఈ రహదారుల దుస్థితిని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసకువెళ్లి ప్రతిపాదనలు సమర్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో సుమారు 13 కిలో మీటర్ల పొడవునా రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

## చిన్నారులకు బంగారు కొండ కిట్ల పంపిణీ



తాడిమళ్లలో బంగారుకొండ కిట్లు అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు



ఖండవల్లిలో బంగారు కొండ కిట్ అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్


**నల్లజర్ల:** పోషకాహార లోపంతో బాధపడుతున్న మండలంలోని 112 మంది చిన్నారులను బంగారు కొండ పథకానికి ఎంపిక చేశారు. ఒక్కో పిల్లాడిని ఒక్కో దాత దత్తత తీసుకున్నారు. దాతలు తాము దత్తత తీసుకున్న చిన్నారులకు నెలకు రూ.500 చొప్పున 6 నెలల పాటు వారి పోషకాహారం నిమిత్తం అందిస్తారు. ఈ మొత్తంతో సమకూర్చిన పోషకాహార కిట్లను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం నల్లజర్లలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.కృష్ణారావు, ఎంపీడీఓ ఎం.రాజశేఖర్,ఐసీడీఎస్ సీడీపీఓ వైబీటీ సుందరి, సూపర్ వైజర్లు వెంకటలక్ష్మి, కేవీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు రూరల్:** మండలంలోని తాడిమళ్ల, సమిశ్రగూడెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపాలు గుర్తించిన చిన్నారులకు బంగారుకొండ కిట్లు పంపిణీ చేశారు. తాడిమళ్లలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి చేతులమీదుగా మంగళవారం లబ్ధిదారులకు ఈ కిట్లు అందజేశారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ నళిని, సర్పంచులు బయ్యే రాధారాణి, తిక్కా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వరరావు, అంగర ఝాన్సీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**పెరవలి:** బంగారుకొండ పథకానికి ఎంపికైన చిన్నారులకు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ఖండవల్లి గ్రామంలో పోషకాహార కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న 44 మంది చిన్నారులను బంగారు కొండ పథకానికి ఎంపిక చేశామన్నారు. మిగతా గ్రామాల్లోనూ లబ్ధిదారులకు పోషకాహార కిట్లు అందించారు. కార్యక్రమాల్లో ఆయా పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, దాతలు, పార్టీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు బంగారు కొండ కిట్లను పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్.రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### యువతి ఆత్మహత్య



ప్రసన్న సింధు (ఫైల్)

**దేవరపల్లి:** అనారోగ్య సమస్యతో బాధపడుతున్న మండలంలోని బందపురం గ్రామానికి చెందిన బండి ప్రసన్న సింధు (19) అనే యువతి సోమవారం రాత్రి తమ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బండి నాగేశ్వరరావు, సత్యవతి దంపతుల కుమార్తె అయిన ప్రసన్నసింధు కొంతకాలంగా రుతుస్రావ సమస్యతో బాధపడుతోంది. నిద్రపోతానని చెప్పి సోమవారం రాత్రి ఆమె తన పడకగదిలోని వెళ్లింది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు ఆమె పడక గదిలోకి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే ప్రసన్న సింధును కిందకు దింపగా, అప్పటికే ఆమె మృతి చెందింది. దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారీ వర్షంతో సేదతీరిన జనం



తాళ్లపూడి మెయిన్ రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

**తాళ్లపూడి:** మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 4.30 నుంచి ఆరు గంటల వరకూ ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. కొద్ది రోజులుగా ఎండలు మండిపోవడంతో ఇబ్బంది పడిన జనం ఈ వర్షంతో సేద తీరారు. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపాడు. సాయంత్రం ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వేగేశ్వరపురం, తాళ్లపూడి, బల్లిపాడు, అన్నదేవరపేట, పెద్దేవం, ప్రక్కిలంక తదితర గ్రామాల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రక్కిలంక వద్ద, తాళ్లపూడి సంత మార్కెట్ వద్ద మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. దాంతో వాహనదారులు కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు.

**చాగల్లు:** మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉక్కబోత, ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వాతావరణం సాధారణంగానే ఉంది. సాయంత్రం దట్టంగా మబ్బులు కమ్ముకోవడంతో కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, చిక్కాల, చాగల్లు, నెలటూరు, మార్కొండపాడు తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది వెంటనే మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

### దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

**నిడదవోలు రూరల్:** మునిపలికి చెందిన బొంతా సుశీల, సాత్విక్, జ్యోతి అనే ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం హెడ్ కానిస్టేబుల్ సోమరాజు మంగళవారం తెలిపారు. ఈనెల 19న ఇంటి సరిహద్దు తగాదాలో అదే గ్రామానికి చెందిన బొంతా రాణిపై దాడి చేసిన కేసులో వారు నిందితులు.

### తొమ్మిది కాసుల బంగారు ఆభరణాల చోరీ

**నిడదవోలు రూరల్:** ఓ మహిళ తన బ్యాగ్‌లో భద్రపరిచిన తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన తిరుమళ్ల జ్యోతి ఈనెల 14న కొవ్వూరు మండలం పెనకనమెట్ట సావరం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహనికి వెళ్లింది. వివాహం అనంతరం ఆమె తాను ధరించిన తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలను బ్యాగ్‌లో పెట్టి, ఆ బ్యాగ్‌తో సహా ఇంటికి బయలుదేరింది. ఇంటికి వచ్చి చూస్తే బ్యాగ్‌లో పెట్టిన ఆభరణాలు కనిపించలేదు. దాంతో జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**దేవరపల్లి:** గోపాలపురంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు వారు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దేవరపల్లి మండలం కొత్తగూడెంకు చెందిన సింగిరెడ్డి సాయి ధరంతేజ్, పెగడ సందీప్ అనే వారు జంగారెడ్డిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి గుడికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తూ జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.